క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పౌర్ణమి హోమాలు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో వెలసిన స్పటిక లింగేశ్వర ఆలయంలో గురువారం శ్రావణ మాస పౌర్ణమిని పురస్కరించుకొని లోక కల్యాణం కోసం హోమాలు నిర్వహించారు. తెల్లవారుజామునే స్పటిక లింగేశ్వర స్వామికి మహాన్యాసపూర్వక ఏక రుద్రాభిషేకం అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ నిర్వాహకులు యోగానంద, తిమ్మయ్య, వాసు పాల్గొన్నారు.

వైభవంగా రాఘవేంద్రస్వామి పూర్వారాధన

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని బైటిపేటలో వెలసిన శ్రీ ఆంజనేయ కోదండ రామ స్వామి దేవస్థానం ఆవరణలో వెలసిన శ్రీగురు రాఘవేంద్ర స్వామి 352 ఆరాధన మహోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వారికి పూర్వారాధన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. వేదపండితులు విటల్ వరదచారి, సుధీంద్రాచార్యుల ఆధ్వర్యంలో మృతికా బృందావనానికి ఉదయామే పంచామృతాభిషేకాలు, తిరుమంజనసేవ తదితర ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం స్వామి వారి బృందావనానికి ప్రత్యేకంగా అలంకరించారు. చెన్నవెంకటేశ్వర్లు, ఆలయ ఈఓ రామాంజనేయశర్మ, ప్రహ్లాదస్వామి పాల్గొన్నారు.

పొలంబడిని సద్వినియోగం చేసుకోండి

నంద్యాల(అర్బన్): ఖరీఫ్‌లో సాగైన పంటలు, వాటికి వస్తున్న తెగుళ్లపై అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. మండలంలోని అయ్యలూరు గ్రామంలో వరిపంటపై గురువారం పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రసాయనిక మందుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలని చెప్పారు. ఒక చదరపు మీటరుకు 33 మొక్కలు ఉండేలా నారు నాటుకోవాలని సూచించారు. లోతు నాట్ల వల్ల మొక్కలకు కావాల్సిన వెలుతురు, పోషకాలు సమపాళ్లలో అంది ఏపుగా పెరిగి అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.

ఆర్థిక సాయం

నంద్యాల(అర్బన్): గడివేముల గని విద్యుత్ సబ్‌స్టేషన్ ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మధు కుటుంబానికి విద్యుత్ శాఖ 3045 యూనియన్ కార్మికులు నాయకులు రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. స్థానిక ఈఈ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కార్మికులు మధు కుటుంబానికి ఈఈ రమణారెడ్డి చేతుల మీదుగా సాయం అందించారు. కరీం మాట్లాడుతూ పదవ తరగతి చదువుతున్న మధు భార్యకు కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇప్పించాలని ఈఈని కోరారు. ఫైల్‌ను పరిశీలించి ఉద్యోగం వచ్చేలా కృషి చేస్తామని ఈఈ తెలిపారు. కార్మికులు మున్ని, అనుష, లావణ్య, రఫీ పాల్గొన్నారు.

జిల్లాకు 13వేల టన్నుల ఎరువులు సరఫరా



మద్దూరు గ్రామ సచివాలయంలో మాట్లాడుతున్న నాగరాజు

చాగలమర్రి: నంద్యాల జిల్లాకు మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం 13వేల టన్నుల కాంప్లెక్స్ ఎరువులను సరఫరా చేసిందని జిల్లా మేనేజరు నాగరాజు తెలిపారు. ఆయన గురువారం మండలంలోని మద్దూరు గ్రామ ఆర్‌బీకేను సందర్శించారు. అలాగే దొర్నిపాడు, ఉయ్యాలవాడ మండలాల్లోని ఆర్‌బీకేలను కూడా తనిఖీ చేయనున్నట్లు చెప్పారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం యూరియా 50 శాతం, డీఏపీతో పాటు కాంప్లెక్స్ ఎరువులను నిష్పత్తిని బట్టి కేటాయిస్తుందని చెప్పారు. జిల్లాలో 411 ఆర్‌బీకేలు ఉన్నాయని, వాటిలో ఇప్పటి వరకు 2,321 డీఏపీ, 1415 ఎన్‌పీకే, యూరియా 2,200, ఎంఓపీ 75 మెట్రిక్ టన్నుల నిల్వలు న్నాయని వివరించారు. మద్దతు ధరతో రైతుల నుంచి సుమారు 1,060 టన్నుల పసుపు కొనుగోలు చేశామన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పీడీలు

నంద్యాల(న్యూటౌన్): ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో జరగనున్న 14వ జాతీయ స్థాయి ఓపెన్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలకు నంద్యాల నుంచి 9మంది క్రీడాకారులు ఎంపికయ్యారని తైక్వాండో కోచ్ మాస్టర్ అబ్దుల్‌మజీద్ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఐదు విభాగాల్లో క్రీడాకారులు పాల్గొంటారన్నారు. అండర్-18లో జి.పల్లవి, అండర్-24లో సింధు, అండర్-27లో లక్కీ, అండర్-37 నీరజ, అండర్-47 ప్రణితేశ్వరి, అండర్-49 యశ్వస్వి, అండర్-45లో మహమ్మద్, అండర్-67లో సానియా, ఓవర్-78 విభాగంలో తేశ్వరినాయుడు పాల్గొంటున్నట్లు వివరించారు.



ఎమ్మెల్యే శిల్పారవికి రాఖీ కడుతున్న చైర్‌పర్సన్, కౌన్సిలర్లు



మాయలూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాఖీ కడుతున్న విద్యార్థినులు

సోదర ప్రేమకు చిహ్నం రక్షాబంధన్

నంద్యాల(వ్యవసాయం)/చాగలమర్రి/ఉయ్యాలవాడ: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని పట్టణంలోని గురువారం సోదరులకు మహిళలు రక్షాబంధన్‌ను కట్టి నీవు నాకు రక్ష.. నేను నీకు రక్ష.. మన ఇద్దరం ధర్మాన్ని, దేశాన్ని రక్షిద్దామని ప్రతిజ్ఞ పూనారు. సోదరి ప్రేమకు ప్రతిరూపంగా నిలిచే రక్షాబంధన్ అన్నచెల్లెళ్ల మధ్య, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమ బంధం వారి ఇరువురి జీవితాల్లో శుభాలను తీసుకొని వస్తుందని నమ్మకం. ఉదయమే తలంటు స్నానం చేసి కొత్త దుస్తులు ధరించి రక్షాబంధనం కట్టే సమయాన సోదరుడి నుదిటన కుంకుమ తిలకం దిద్ది గంధం రాసి అక్షింతలు చల్లి కొబ్బరికాయలు ఇచ్చి మిఠాయిలు తినిపించి రాఖీ కట్టి, హారతులు ఇచ్చి, కాళ్లకు నమస్కారం చేసి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా సోదరులు తమ సోదరికి తమ ఆశీస్సులు అందజేసి, బహుమతులు అందజేశారు. పట్టణంలో పలువురు మహిళలు అన్నలకు, తమ్ముళ్లకు రాఖీలను కట్టుకొని మిఠాయిలు పంచుకొని సంబరాలు చేసుకున్నారు.ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డికి మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, పలువురు కౌన్సిలర్లు రాఖీ కట్టి మిఠాయిలు తినిపించారు. ఆయుష్ యోగా కేంద్రంలో ప్రముఖ ఆధ్యాత్మిక గురువు ఆనంద్ గురూజీ ఆధ్వర్యంలో రాఖీ పౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని తోటలైన్ ప్రభుత్వ ఎలిమెంటరీ పాఠశాలలో హెచ్‌ఎం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విద్యార్థినులు విద్యార్థులకు రాఖీలు కట్టారు.చాగలమర్రి, ఉయ్యాలవాడలో విద్యార్థులకు విద్యార్థినులు రాఖీ కట్టారు.



చాగలమర్రి ఎస్‌ఐకి రాఖీ కడుతున్న మహిళ

విజయవంతం చేయండి

నంద్యాల(న్యూటౌన్): సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో తిరుపతి పట్టణంలో జరిగే పీడీఎస్‌యూ రాష్ట్ర విద్యావైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి రాంబాబు కోరారు. స్థానిక కార్యాలయంలో పీడీఎస్‌యూ కరపత్రాలను విడుదల చేశారు. బాషా, సతీష్, రమణ, వెంకటేష్, పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

నంద్యాల(సెంట్రల్): ఎరువుల కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జీవనియంత్రణ ప్రయోగశాల ఏడీఏ ఎస్‌సుధాకర్ దుకాణ యజమానులను హెచ్చరించారు. గురువారం ఏఓ ప్రసాదరావుతో కలిసి సోమవారం నుంచి గురువారం వరకు జిల్లా కేంద్రంలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు చేశారు.

దుకాణాల్లో చోరీ

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలోనున్న రెండు దుకాణాల్లో చోరీకి పాల్పడి పక్కనే మరో ఐదు దుకాణాల్లో చోరీకి విఫలయత్నం చేసిన సంఘటన గురువారం వేకువజామున చోటుచేసుకుంది. త్రీటౌన్ సీఐ నరసింహులు తెలిపిన వివరాల మేరకు.. బేకరి, ఫైనాన్స్ కార్యాలయాల తాళాలు పగులగొట్టి బేకరీలో ఉన్న రూ.12 వేల నగదు, ఫైనాన్స్ కార్యాలయంలో ఉన్న రూ.2 వేలు దోచుకున్నారు. అలాగే.. మరో ఐదు దుకాణాలలో చోరీ చేసేందుకు విఫలయత్నం చేశారు. ఉదయాన్నే పరిశీలించిన యజమానులు పోలీసులకు సమాచారం అందించటంతో సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికులను విచారించారు. భాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు.

నేటి నుంచి రీ సర్వే

నంద్యాల(అర్బన్): మండలంలోని 9 గ్రామాల్లో శుక్రవారం నుంచి జగనన్న భూహక్కు-భూరక్షకు సంబంధించిన రీ సర్వే ప్రారంభం కానుందని నంద్యాల తహసీల్దార్ శ్రీనివాసులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కానాల, అయ్యలూరు, పోలూరు, మిట్నాల, ఊడుమాల్పురం, పులిమద్ది, బ్రాహ్మణపల్లె, మూలసాగరం, నూనెపల్లె గ్రామాల్లో సర్వే ప్రారంభం కానుందని, గ్రామ పెద్దలు, సర్పంచ్ సర్వేలో భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు.

రేపు మండల మీట్

గోస్పాడు: ఈనెల 2వ తేదీన ఎంపీపీ ఆర్థర్ సైమాన్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు సమావేశానికి తప్పక హాజరు కావాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యకర జీవనం



లబ్ధిదారులకు దేశవాళి విత్తన కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల



లబ్ధి పొందిన పథకాలను చదివి వినిపిస్తున్న ఎమ్మెల్యే గంగుల

ఆళ్లగడ్డ: ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగమైనపుడే ఆరోగ్యకర జీవనం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. స్థానిక మార్కెట్ యార్డ్ ఆవరణలో బీఎస్‌ఎఫ్ పథకం ఆధ్వర్యంలో గురువారం ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసకుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన హెడ్యూల్ కులాలకు చెందిన ప్రకృతి వ్యవసాయదారులకు ఉచితంగా రూ.10 వేల విలువజేసే దేశవాళి విత్తనాల కిట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ దళిత రైతులను ప్రకృతి వ్యవసాయ సాగులో ప్రోత్రహించేందుకు పీఎంజేవై పథకం ద్వారా నియోజకవర్గంలోని 296 మంది ఎస్సీ రైతులకు కిట్లు అందజేస్తామని చెప్పారు. ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, సింగం వెంకటేశ్వర్‌రెడ్డి. కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ నాసారి వెంకటేశ్వర్లు, జెడ్‌బీఎస్‌ఎఫ్ సిబ్బంది ఉన్నారు.

నవరత్నాలతో పేదల ఆర్థిక పురోగతి

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాలతో పేద కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు.గురువారం పట్టణ శివారులోని పడకండ్ల ఎస్సీ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించి ప్రభుత్వ పథకాల బ్రోచర్లను వారికి అందజేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ ఏఈ సురేంద్ర, నాయకులు సుధాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, నీలకంఠేశ్వర్‌రెడ్డి, రామిరెడ్డి, చిన్నరామిరెడ్డి, చిన్నవెంకటసుబ్బయ్య, గోపాల్, రాజ ఉన్నారు.

వాపును చూసి మురిసిపోవద్దు

చాగలమర్రి: వాపు చూసి బలమనుకొని టీడీపీ మురిసిపోతుందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రాడ రెడ్డి ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో యువగళం పేరుతో పాదయాత్ర చేస్తున్న నారాలోకేష్ యాత్ర విజయవంతంగా సాగుతోందని, ఇక తమకు రాష్ట్రంలో అడ్డులేదని కలల లోకంలో విహరిస్తుందన్నారు. ఆయన బుధవారం మండల కేంద్రంలో ఓ శుభకార్యంలో పాల్గొన్న అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆ పార్టీ నాయకులు తమ బలాన్ని నిరూపించుకోవటానికి డబ్బులు, మందు ఎర చూపి తరలిస్తున్న జనాలను చూసి బలుపు అని అనుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో ఆధికారాన్ని దక్కించుకొవటానికి మళ్లీ బీజేపీకి దగ్గరవ్వటానికి ప్రయత్నాలు చేస్తున్న చంద్రబాబు నాయుడు తీరును ప్రజలు గమనిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికలలో ప్రజలు టీడీపీకి మళ్లీ బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

అన్ని వార్డులను అభివృద్ధి చేస్తున్నాం

- ప్రాధాన్యతాక్రమంలో అభివృద్ధి పనులు
- మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్‌మాబున్నిసా

నంద్యాల(సిటీ): పట్టణంలోని అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేస్తున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా తెలిపారు. గురువారం ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ వెంకటదాసు ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముందుగా మాజీ కౌన్సిలర్ చంద్రమోహన్ మృతికి కౌన్సిల్ సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం అజెండాలోని అన్ని అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. తదనంతరం పలువురు సభ్యులు తమ వార్డుల్లోనెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సభ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా టీడీపీ కౌన్సిలర్ జైనాబీ తమ వార్డు పట్ల వివక్ష చూపిస్తున్నారని ఆరోపించారు. ఇందుకు చైర్‌పర్సన్ సమాధానమిస్తూ పక్కా ప్రణాళికతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ప్రాధాన్యతాక్రమంలో అభివృద్ధి పనులు చేయిస్తున్నామని, ప్రస్తుతం అధిక వార్డుల్లో పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఏ ఒక్క వార్డుపై వివక్ష చూపమని స్పష్టం చేశారు. ప్రతి వార్డులో పనులు చేస్తున్నందునే పట్టణ ప్రజలకు వైఎస్సార్‌సీపీని అభిమానిస్తున్నారన్నారు.



మాట్లాడుతున చైర్‌పర్సన్ షేక్‌మాబున్నిసా

రోడ్ల ప్యాచ్‌వర్క్‌లు దాదాపుగా పూర్తి చేశాం..

పట్టణంలోని 42వార్డుల్లో గుర్తించిన 516 ప్యాచ్ వర్కులకు గాను ఇప్పటికే 460 పనులు పూర్తి చేశామన్నారు. కౌన్సిల్‌లో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మున్సిపల్ ఇంజినీర్ రమణమూర్తి సమాధానమిచ్చారు. అంతే కాకుండా ప్రాధాన్యతాక్రమంలో పనులు చేపట్టామని త్వరలో పట్టణమంతా రోడ్లు బాగు చేస్తామన్నారు. అంతే కాకుండా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఇదివరకే పలు వార్డుల్లో నూతన రోడ్లు నిర్మించామని వివరించారు.

– రక్షా బంధన్ పండుగను పురస్కరించుకుని స్థానిక 19వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ పరుచూరి నారాయణమ్మ మున్సిపల్ అధికారులైన డాక్టర్ అంకిరెడ్డి, లక్ష్మీనారాయణ, శివప్రసాద్‌రెడ్డికి రాఖీ కట్టి మిఠాయిలు పంచారు.

సమావేశానికి కౌన్సిలర్లు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, డీఈఈలు జయభారతరెడ్డి, మధుకుమార్, శ్రీనివాసరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

వస్తు సామగ్రి జాగ్రత్త!

రుద్రవరం: ఆరు బయట,కళ్లాల్లో దాచిన వస్తు సామగ్రిని జాగ్రత్తగా చూసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. అలాంటి వాటి తరలిస్తున్న కొందరి రైతులు నిఘావేసి పట్టుకొని ఆ గ్రామ సచివాలయ మహిళా పోలీసుకు పట్టించిన ఘటన గురువారం మందలూరులో చోటుచేకుంది. ఆళ్లగడ్డ పట్టణం, చుట్టు పక్కల గ్రామాల నుంచి కొందరు గ్రామాలకు వెళ్లి రోడ్డు పక్కన పడేసిన ప్లాస్టిక్ వస్తు సామగ్రి, గ్రామ శివారుల్లో పడేసిన పాత సామాన్లను సేకరించుకొని పట్టణంలో విక్రయించి వచ్చే సొమ్ముతో జీవనం సాగిస్తున్నారు. అయితే కాల క్రమేణా.. ఆ ప్రక్రియలో కాస్త మార్పు చోటు చేసుకుంది. పల్లెల్లో రైతులు వ్యవసాయానికి పనికి వచ్చే వస్తు సామగ్రిని ఇళ్ల వద్ద ఉంచుకునేందుకు వసతి లేక పోవడంతో ఆరు బయట,కళ్లాల్లో భద్ర పరుచుకుంటున్నారు. రైతులు, కూలీలు పొలాలకు వెళ్లినప్పుడు పాత సామగ్రి కోసం వచ్చిన వారు గుట్టు చప్పుడు కాకుండా ఆ సామగ్రిని తరలిస్తున్నారు. కొద్ది రోజులుగా తమ వస్తువులు మాయమవుతుండటంపై పలువురు రైతులు నిఘా వేశారు. ఇందులో భాగంగా గురువారం మందలూరులో ఇద్దరు బాలికలు మండల ఉపాధ్యక్షుడు వీర శంకర్‌రెడ్డికి సంబంధించిన విద్యుత్ తీగలను తరలిస్తుండగా కుటుంబ సభ్యులు పట్టుకుని మహిళా పోలీసుకు అప్పగించారు. ఎస్‌ఐ శరత్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటివి జరగకుండా చర్యలు చేపడతామని చెప్పారు.

అభివృద్ధికి తోడ్పడండి

గోస్పాడు: క్షేత్రస్థాయిలో ఉపాధి సిబ్బంది సక్రమంగా పని చేసి అభివృద్ధికి తోడ్పడాలని జిల్లా అంబుడ్స్ పర్సన్ సురేంద్రకుమార్ సూచించారు. మండలంలోని జూలేపల్లె, గోస్పాడు గ్రామాల్లో ఉపాధి పనుల నిర్వహణ తీరుపై సిబ్బందితో గురువారం సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయి సిబ్బంది గ్రామాల్లో సక్రమంగా పనులు కల్పించాలని చెప్పారు. కూలీలకు సకాలంలో పనులు కల్పించి వారికి పనుల నిర్వహణపై అవగాహన కల్పించాలన్నారు. పనులు జరిగిన తీరు, సమస్యలపై ఉపాధి కూలీలతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ భాస్కర్, ఏపీఓ నాగజ్యోతి, ఈసీ ఉమామహేశ్వరరావు, టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి..



మాట్లాడుతున్న జిల్లా అంబుడ్స్ పర్సన్ సురేంద్రకుమార్

ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని జిల్లా కోశాధికారి బాలన్న, మండల అధ్యక్షుడు నాగజ్యోతీశ్వరరెడ్డి కోరారు. ఈ మేరకు జిల్లా అంబుడ్స్ పర్సన్ సురేంద్రకుమార్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు పనికి తగ్గ వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. నెలకు రూ.21 వేలు వేతనాన్ని చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.ఫీల్డ్ అసిస్టెంట్లు లింగేశ్వర రెడ్డి, సరోజ, జ్యోతి, మోహన్ పాల్గొన్నారు.

అర్హత ఆధారంగా పథకాలు

నంద్యాల(సిటీ): అర్హతే ఆధారంగా ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 30వ వార్డు ఎంఎస్ నగర్‌లో కౌన్సిలర్ పోలూరు లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ పోలూరు రామచంద్రుడుతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి పథకాల గురించి వివరించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. అవినీతి అవకాశం లేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో లబ్ధి మొత్తాన్ని జమ చేసి పారదర్శక పాలన సాగిస్తున్న జగనన్న దేశానికే ఆదర్శంగా నిలిచారని చెప్పారు. చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా, నాయకులు కష్టారెడ్డి, రామకృష్ణ, సత్తార్, షరీఫ్, తులసి, దివాకర్, రవి, శంకర్, లోకేష్, మధు, చోటు, రాజేష్,ఆదిరెడ్డి భాస్కర్ రెడ్డి, సాయిరాం రెడ్డి పాల్గొన్నారు.

భాగ్యనగరం స్కూల్‌కు క్రీడా ప్రతిభా అవార్డు

దొర్నిపాడు: భాగ్యనగరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు క్రీడా ప్రతిభా అవార్డు వరించింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పోర్ట్స్ డేను బాలిక ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. గతేడాది జాతీయ, రాష్ట్ర స్థాయిలో హ్యాండ్‌బాల్, త్రోబాల్, సాఫ్ట్‌బాల్ క్రీడల్లో ప్రతిభ చూపడంతో ఈ ఈవార్డు లభించింది. హెచ్‌ఎం ఆదిలక్ష్మమ్మ గురువారం పీడీ శ్రీధర్‌ను సన్మానించి క్రీడాకారులను అభినందించారు.

నిల్వ నీటి ప్రాంతాలను గుర్తించండి

నంద్యాలటౌన్: గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లో నిల్వ నీరు ఉన్న ప్రాంతాలను సత్వరమే గుర్తించాలని జిల్లా మలేరియా అధికారి కామేశ్వర రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆశా సిబ్బంది తమ పరిధిలో ఉన్న ప్రాంతాలలో నీరు నిల్వ ఉన్న ప్రాంతాల లొకేషన్, ఫొటోలను హైజీన్ యాప్‌లో నమోదు చేసి పారిశుద్ధ్య సిబ్బంది వాటిని పరిష్కరించే వరకు ఆయా ప్రాంతాలను పర్యేక్షించాలన్నారు. సమస్య పరిష్కారం అయిన తదుపరి ఫొటోలు, లొకేషన్లు యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

పోలీసుల అదుపులో అనుమానితులు

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని ఎస్బీఐ కాలనీలో నంద్యాల గార్డెన్స్ అపార్ట్‌మెంట్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని స్థానికులు గురువారం టూటౌన్ పోలీసులకు అప్పగించారు.

జీతాలు చెల్లించాలి

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయుల జీతాలు చెల్లించకుండా ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేయడం తగదని, డీఎస్సీని విడుదల చేయాలని, పని సర్దుబాటు బోధనకు అంతరాయం లేకుండా చూడాలని ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో అజామ్‌బేగ్, మౌలాలి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.

గుడిసె దగ్ధం

రుద్రవరం: మండలంలోని పెద్దకంబలూరులో గురువారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో గురువయ్యకు చెందిన పూరి గుడిసె దగ్ధమైంది. బాధితుడి వివరాల మేరకు.. రాత్రి ఇంట్లో వంట చేస్తుండగా ప్రమాద వశాత్తు గుడిసె పై భాగంలో మంటలు చెలరేగాయి. వెంటనే బయటకు పరుగులు తీసి కేకలు వేయగా ఇరుగు పొరుగు వారు వచ్చి ఆర్పేందుకు యత్నించారు. మంటలు అదుపు కాక పోవడంతో ఆళ్లగడ్డ అగ్ని మాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించగా వారు వచ్చేసరికే గుడిసె కాలి బూడిదైంది.

జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): దేశాన్ని రక్షించండి.. రాష్ట్రాన్ని కాపాడండి అంటూ సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర నంద్యాలకు వస్తుందని, పట్టణంలోని టౌన్‌హాల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి సదస్సు సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు కోరారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

అగ్నిప్రమాదం

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని పఠాన్ పేటలోని ఓ ఇంట్లో గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. ఫైర్ ఆఫీసర్ యోగేశ్వరరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. బషిరూన్ ఇంటి బయట దోశల వేస్తూ వ్యాపారం చేస్తుండగా ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారంతో ఫైర్ ఇంజిన్ సాయంతో మంటలు అదుపుచేశామన్నారు.

ధరలు తగ్గించాలి

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర ప్రభుత్వం విధానాల వల్ల అధిక ధరలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ధరలు తగ్గించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని 25వ వార్డులో బైటిపేట, పెద్దబండ, తెలుగుపేటలోని గడప గడపకు తిరుగుతూ ప్రజల సమస్యలను తెలుసుకొని కరపత్రాలు పంచారు. సీపీఎం కార్యదర్శి పుల్లానరసింహులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ



చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి

నంద్యాల(అర్బన్): స్థానిక టెక్కె మార్కెట్‌యార్డులో గురువారం శిల్పా మహిళా సహకార్ బ్యాంక్ చైర్‌పర్సన్ నాగినిరెడ్డి అధ్యక్షతన 210 మంది మహిళలకు రూ.29.70లక్షల విలువజేసే చెక్కులను ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి అందజేశారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

రుద్రవరం: పందిర్ల పల్లెకు చెందిన నరసింహ అనే వ్యక్తి గురువారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సమస్యల కారణంగా మనస్థాపానికి గురైన ఇంట్లో ఉన్న పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

మూగజీవులకు రక్షణ కల్పిద్దాం

నంద్యాలటౌన్: సమాజంలో మానవులతో పాటు మూగజీవాలను రక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాయలసీమ యానిమల్ వెల్ఫేర్ ఫౌండేషన్ సభ్యులు రామ్ చరణ్, రాఘవేంద్ర, హర్ష తెలిపారు. రక్షాబంధన్ సందర్భంగా గురువారం స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని గోశాలలో గోవులు, శునకాలకు రాఖీ కట్టారు.

బీమా తక్షణ సాయం అందజేత

నంద్యాల(సిటీ): పట్టణంలోని నూనెపల్లెలో నివాసం ఉంటున్న లంకె సుబ్బరాయుడు గురువారం మృతి చెందాడు. మృతుడు వైఎస్సార్ బీమా లబ్ధిదారు కావడంతో తక్షణ సాయం కింద రూ.10వేలు ఆయన భార్యకు వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ అనిల్ అమృతరాజ్, వార్డు సచివాలయ కన్వీనర్ వెంకటేష్, అడ్మిన్ నారాయణ, వెల్ఫేర్ సెక్రటరీ గు రుస్వామి, వలంటీర్ హుసేన్‌బాషా అందజేశారు.

కేసు నమోదు

దొర్నిపాడు: డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో పొలానికి నీళ్లు మళ్లించుకునే విషయంలో జరిగిన ఘర్షణలో నాగేంద్రపై నలుగురు వ్యక్తులు దాడి చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిరుపాల్ గురువారం తెలిపారు. పొలంలోని పంటకు సాగునీరు కట్టుకునే విషయంలో పెద్ద సంజీవరాయుడు, చిన్న సంజీవరాయుడు,నాగయ్య, పెద్దయ్య కలిసి నాగేంద్రపై దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాది మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

బహిరంగ ప్రకటన

ఈ బహిరంగ ప్రకటన మూలంగా అందరికి తెలియజేయడమేమనగా నంద్యాల టౌన్‌కు చెందిన పి.జాలాపతి మరియు అతని తమ్ముడు పి. ఓబులేసులకు క్రింది షెడ్యూలు ఆస్తులయందు సమాన భాగము కల్పిస్తూ వారి తల్లిగారైన పి. చిన్నఓబులమ్మ 7-9-2018న రిజిష్టర్ వీలునామ రాసి ఆమె 14-12-2022న చనిపోయినారు. కావున పై వీలునామా ప్రకారము పై ఇద్దరికి చెరి సగభాగము షెడ్యూల్ ఆస్తులయందు హక్కు కలదు. కావున పి.ఓబులేసు షెడ్యూల్ ఆస్తులను అమ్మిన చెల్లదు. కొనినవారికి ఎటువంటి హక్కులు సంక్రమించవు.

షెడ్యూలు ఆస్తులు: నంద్యాల టౌన్, సాయిబాబానగర్ డోర్‌నెం.28/1060-6లో ఉండే ఇల్లు మరియు నంద్యాల జిల్లా, గోస్పాడు మండలం, సాంభవరంగ్రామంలో సర్వే నెం.114లో 0.44సెంట్లు, సర్వేనెం.221లో 0.95 సెంట్లు, సర్వేనెం.81లో 0.33 సెంట్లు, సర్వే నెం.260లో వున్న 0.33 సెంట్లు వ్యవసాయభూమి.

- V. SUBBA REDDY
Advocate, Kadapa

VASAVEE ADS, KDP